రైతులకు భూధార్‌ టెన్షన్‌

- సొంత పట్టాలు కలిగిన వారికే అవకాశం
- డీకేటీ పట్టాలు, కౌలు రైతులపై రానీ స్పష్టత
- భూధార్‌ లేకుంటే పథకాలు అందవంటున్న అధికారులు
- ఈనెల 25వ తేదీ వరకు గడువు

సింహాద్రిపురం : ఆధార్‌ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొంత భూ పట్టాలు కలిగిన ప్రతి రైతుకు 14 అంకెల గుర్తింపు సంఖ్యను జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్‌ యూనిక్‌ ఐడీ నమోదు ప్రక్రియను చేస్తున్నారు. భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుందని, ఈనెల 25వ తేదీలోగా రైతులు ఫార్మర్‌ రిజిస్ట్రేషన్‌ విధిగా చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. లేనిపక్షంలో ఎలాంటి పథకాలు అందవని హెచ్చరిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళనతో రైతు సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. దేశానికి రైతు వెన్నెముక అని మాటలు చెబుతూనే వారి నడ్డి విరిచే కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూధార్‌కు సంబంధించి తొలుత పీఎం కిసాన్‌ లబ్ధిదారులకే ఫార్మర్‌ రిజిస్ట్రేషన్‌ అవకాశం కల్పించారు. ఆ తర్వాత సొంత భూములు కలిగి పట్టాలు ఉన్న వారికి అవకాశం కల్పించారు. ప్రస్తుత రబీ పంటల కోతలు, నూర్పిళ్లు, సాగు పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. మరో రెండు నెలలపాటు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రైతుల రిజిస్ట్రేషన్‌ను ఈనెల చివరివరకు గడువు ఇస్తూ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆందోళనలో అన్నదాతలు

ఫార్మర్‌ రిజిస్ట్రేషన్‌పై స్పష్టతలేక కొంతమంది అసైన్డ్‌, డీపట్టా భూములు కలిగిన రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్‌ చేసుకునేందుకు అక్కడికి వచ్చి ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆప్షన్‌ ఇవ్వలేదని అధికారులు చెబుతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కౌలు రైతులకు ఫార్మర్‌ రిజిస్ట్రేషన్‌ గురించి మాకు ఎలాంటి సమాచారం లేదని అధికారులు చెబుతున్నారు. వీరంతా తమకు పథకాలు అందుతాయో, లేదోనని ఆందోళనలో పడ్డారు. అలాగే దేవాదాయ, అటవీ భూములు సాగు చేసుకునే రైతులు యూనిక్‌ కార్డుల ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అన్ని రకాల రైతులకు యూనిక్‌ ఐడీ కార్డులను అందజేయాలని రైతులు డిమాండ్‌ చేస్తున్నారు. మరోవైపు ఫార్మర్స్‌ రిజిస్ట్రేషన్‌ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు రైతులు, వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. ఒకే సర్వే నెంబర్‌లో అన్నదమ్ములు లేదా ఇతర పేర్లు ఉంటే ఒకరి పేరే నమోదవుతోంది. కొంతమంది రైతుల ఆధార్‌, ఫోన్‌ నంబర్లు అనుసంధానమవ్వక నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నప్పటికీ మూడుసార్లు ఓటీపీ వచ్చేందుకు సమయం తీసుకుంటుండటంతో రైతులు పనులు మానేసి రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



భూధార్‌ కోసం ఫార్మర్‌ రిజిస్ట్రీ చేస్తున్న రైతు సేవా కేంద్ర సిబ్బంది

ఇంటర్నెట్‌, సర్వర్‌ సమస్యలతో జాప్యం

వివిధ రకాలు పట్టాలు కలిగిన రైతులు మండల వ్యాప్తంగా 13,540 మంది ఉండగా, ఇందులో సొంత పట్టా కలిగిన రైతులకు మాత్రమే తొలి విడతగా ఫార్మర్స్‌ రిజిస్ట్రేషన్‌ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు సుమారు 5900 మంది రైతులకు రిజిస్ట్రేషన్‌ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరో 8 వేల మందికి పైగా రైతులకు రిజిస్ట్రేషన్‌ చేయాల్సి ఉంది. ఈనెల 25వ తేదీలోగా రైతుసేవా కేంద్రాల్లో రైతులు విధిగా రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ఇంటర్నెట్‌ సక్రమంగా రాకపోవడం. సర్వర్‌ సమస్యలు తలెత్తడం తదితర కారణాలతో ఈ ప్రక్రియ అలస్యంగా నడుస్తోంది. రైతులందరికీ ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ వారు చేస్తున్నారు.

కౌలు రైతులకు అన్యాయం



కౌలు రైతులకు విశిష్ట సంఖ్యను నమోదు చేయకపోవడం అన్యాయం. గత ప్రభుత్వంలో సొంత భూమి ఉన్న వారితోపాటు కౌలు రైతులకు కూడా రైతుభరోసా అందేది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌ పథకాల మంజూరుకు విశిష్ట సంఖ్యను మెలిక పెట్టడం. సొంత భూమి ఉన్న రైతులకే విశిష్ట సంఖ్య నమోదు చేయడం, డీకేటి, కౌలు రైతులను పథకాల నుంచి దూరం చేయడమే. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలన్నీ ఆగిపోయాయి.
– గంగరాజు, రైతు, సింహాద్రిపురం

ప్రతి రైతు నమోదు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూధార్‌ యూనిక్‌ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు తమ వివరాలు నమోదు చేయించుకుని విశిష్ట సంఖ్యను పొందాలి. సింహాద్రిపురం మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకు దాదాపు 58 శాతం మంది నమోదు చేసుకున్నారు. మిగిలిన రైతులు త్వరగా నమోదు చేసుకోవాలి.
– శివమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, సింహాద్రిపురం

లింగాలలో సినిమా షూటింగ్‌



సినిమాకు క్లాప్‌ కొడుతున్న వైఎస్‌ వెంకటరెడ్డి

లింగాల : మండలంలోని చిన్నకుదాల గ్రామంలో మంజునాథ ప్రొడక్షన్స్‌–2 ఆధ్వర్యంలో ప్రొడ్యూసర్‌ మంజునాథరెడ్డి, డైరెక్టర్‌ షఫీ, అనిల్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిచ్‌ కిడ్‌ తెలుగు సినిమాకు శుక్రవారం వైఎస్‌ వెంకటరెడ్డి క్లాప్‌ కొట్టి సినిమాను ప్రారంభించారు. ప్రొడ్యూసర్‌ మాట్లాడుతూ గతంలో మా ఊరు సినిమా తీయడం జరిగిందన్నారు. మంజునాథ ప్రొడక్షన్‌ టు ఆధ్వర్యంలో రిచ్‌కిడ్‌ చిత్రాన్ని నాలుగు రోజులపాటు చిన్న కుదాలగ్రామంలో, మూడు రోజులపాటు తాతిరెడ్డిపల్లెలో ఈ చిత్రాన్ని నిర్మిస్తామన్నారు.

పనిభారం తగ్గించాలి

పెండ్లిమర్రి : సచివాలయ పంచాయతీ కార్యదర్శులకు అదనపు విధులు కేటాయించకుండా పనిభారం తగ్గించాలని సచివాలయ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌ ఫీడ్‌ బ్యాక్‌ తీసుకోనేదానికి సంబంధిత రెవెన్యూ విషయాలు ఉన్నాయి. వాటి వల్లన పంచాయతీ కార్యదర్శులకు చాలా ఇబ్బందిగా ఉంది. దానికి సంబంధిత శాఖకు అప్పగించి మాపై ఒత్తిడి తగ్గించాలని కోరారు.

క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్‌ మెడికల్‌ సెంటర్‌(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆదివారం మధ్యాహ్నం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్‌ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్‌ వ్యాధి నిపుణులు డాక్టర్‌ డి.నిహారిక క్యాన్సర్‌ అవగాహన, స్క్రీనింగ్‌, క్యాన్సర్‌ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్‌ సంబంధిత సంప్రదింపులు ఉంటాయన్నారు. గుండె జబ్బులు, క్యాన్సర్‌ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్‌ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 085682 86189 అనే ఫోన్‌ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

27న ఉప సర్పంచ్‌ ఎన్నిక

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌ ఎన్నిక ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ కెజియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోగటం 10వ వార్డు మెంబర్‌గా ఉండి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన నాగ ప్రసాద్‌రెడ్డి గత ఏడాది వివిధ కారణాల రీత్యా తన ఉప సర్పంచ్‌ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్‌ ఎన్నికను ఈనెల 27న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషన్‌ ఉత్తర్వులిచ్చింది. దీంతో ఉప సర్పంచ్‌ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

దివ్యాంగులకు దుస్తుల వితరణ



దుస్తులను అందిస్తున్న మహమ్మద్‌ ఆలీ

పులివెందుల టౌన్‌ : పవిత్ర రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో శుక్రవారం దివ్యాంగులకు ఎస్‌బీఎస్‌ హోంనీడ్స్‌ యజమాని మహమ్మద్‌ ఆలీ, కుమారుడు మహమ్మద్‌ తౌఫిక్‌ ఆలీలు దుస్తులను వితరణగా అందించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్‌ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వికలాంగుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పనులపై ఓపెన్‌ ఫోరం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్‌ ఆడిట్‌ ఓపెన్‌ ఫోరం నిర్వహిస్తున్నామని ఏపీఓ గంగరాజు తెలిపారు. 2023 ఏప్రిల్‌ నుంచి 2024 మార్చి వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించిన పనులపై సోషల్‌ ఆడిట్‌ అధికారులు ఎస్‌ఆర్పీ భాస్కర్‌ ఆధ్వర్యంలో 10 రోజులుగా తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కూలీల అభిప్రాయాలను సేకరించారు. కూలీలకు రూ.5.42 కోట్లు, మెటీరియల్‌ పేమెంట్‌ కింద రూ.4.22 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిపై శనివారం ఉదయం ఓపెన్‌ ఫోరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓపెన్‌ ఫోరం సభకు ఉపాధి హామీ పీడీ ఆదిశేషారెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు, ఉపాధి హామీ ఫీల్డ్‌, టెక్నికల్‌ అసిస్టెంట్లు, ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్‌ : బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు ఇచ్చేలా, వాటి ప్రయోజనాలను అర్థమయ్యేలా తల్లులకు తెలియజేయాలని సీడీపీఓ శ్రీలత అంగన్‌వాడీ టీచర్లకు తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రంబడి పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు పోషకాహార పోషణ్‌–2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ సూక్ష్మ, స్థూల పోషకాహారాలు ప్రాధాన్యత, పోషకాహారం లోపం వచ్చినప్పుడు వాటి నుంచి ఎలా బయటపడాలి అని దానిపైన తల్లులకు కౌన్సిలింగ్‌ ఇవ్వాలన్నారు. అలాగే పిల్లలకు పోషకాహారం, సమతుల్య ఆహారం, ఆహారంలో వైవిధ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం తదితర వాటి గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ మాబున్నీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధి కడప రోడ్డులోని మార్కెట్‌ యార్డు వద్ద రోడ్డు దాటుతుండగా స్కూటర్‌ ఢీకొన్న సంఘటనలో వృద్ధుడు పెద్దకులాయిరెడ్డికి తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన వ్యక్తిని వెంటనే స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేటి నుంచి జ్యోతి ఉత్సవాలు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్‌ కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జ్యోతి ఉత్సవాలలో గ్రామోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రామోత్సవంలో జ్యోతుల వెంబడి మడితో బోనపు కడవలను తలపై పెట్టుకుని తిరిగితే సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని, తీరని కోరికలు సైతం తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



వెంకటాపురం వీవర్స్‌ కాలనీలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారు

కార్యక్రమ వివరాలు

ఉత్సవాలలో శనివారం ఉదయం చౌడేశ్వరీదేవి అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తారు. గ్రామ దేవత వద్ద చల్ల కార్యక్రమం జరుగుతుంది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తారు. సాయంత్రం బిందె సేవ జరుగుతుంది. రాత్రి జ్యోతులతో జ్యోతి ఉత్సవం, అమ్మవారి గ్రామోత్సవాలను నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం జ్యోతులను ఆర్పుట, బలి దానాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రేపు దుగ్గాయపల్లెలో..

ఆదివారం దుగ్గాయపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రికి జ్యోతి ఉత్సవాలు, అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. సోమవారం ఉదయం జ్యోతులను ఆర్పుట, బలి దానాలు జరుగుతాయి. కాగా మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం జాతర జరగనుంది. ఇందులో భాగంగా గ్రామ దేవతల ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. జాతర నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

జ్యోతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రజల కోరిక మేరకు ఆది, సోమ వారాలలో కడప నుంచి పెద్దపుత్త వరకు ఏపీఎస్‌ ఆర్‌టీసీ ప్రత్యేక బస్సు సరీ్వసును నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు కడప పాత బస్టాండులో ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 4 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

కమలాపురం : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. మండలంలోని పొడదుర్తి గ్రామంలో టైఫాయిడ్‌, మలేరియా జ్వరాలు ప్రబలాయని తెలియడంతో ఆమె గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికి జ్వర పీడితులున్నారని తెలుసుకుని వారి వద్దకు వెళ్లి సలహాలు, సూచనలు అందజేశారు. దోమలు వ్యాప్తి చెంద కుండా ఇంటింటికి పెరిత్రిన్‌ స్ప్రే చేయించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే– డ్రైడే చేపట్టాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. జ్వరాలు రాగానే సమీప ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కెజియా, కార్యదర్శి శివారెడ్డి, మలేరియా సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ లక్ష్మయ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌ అంతరాయం

వల్లూరు (చెన్నూరు) : కడప నగరంలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా చెన్నూరు మండల వ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని చెన్నూరు విద్యుత్‌ ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ వ్యవస్థను మోసం చేయవద్దు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

జమ్మలమడుగు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ వ్యాప్త ఆర్టీసీ వ్యవస్థపైన అనుసరిస్తున్న విధానాల వల్ల ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని సీఐటీయూ నాయకులు శుక్రవారం ఆర్టీసీ డిపోలో కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి విజయ్‌ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ విద్యుత్‌ బస్సులను నిర్వహించుకునే అవకాశం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. దేశంలో వివిధ ఆర్టీసీల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగ కార్మికులు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఆర్టీసీ భవిష్యత్తులో కనుమరుగు కాకుండా కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

వేంపల్లె : పర్యావరణ పరిరక్షణ అనేది అందరి బాధ్యత అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్‌ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం ప్లాస్టిక్‌ వస్తువుల ద్వారా మార్పులు వస్తున్నట్లు తెలిపారు. వైజ్ఞానిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఫలితంగా ప్లాస్టిక్‌ వస్తువుల నుండి నష్టాలు అధికంగా ఉంటాయన్నారు. దుష్ఫలితాలు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం కవి డ్యాన్స్‌ అకాడమి బృందం చెక్కభజన, కళా నృత్యాల ద్వారా ప్లాస్టిక్‌ వస్తువుల ద్వారా కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమల ద్వారా అవగాహన కల్పించిన విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారులు ఓబుల్‌రెడ్డి, మల్లేశ్వరమ్మ, లైబ్రేరియన్‌ మాధవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు

అంధుల ఆశ్రమానికి ఎస్‌ఎంఎస్‌ చేయూత

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమానికి శుక్రవారం ఎస్‌ఎంఎస్‌ చేయూతను అందించింది. ఎస్‌ఎంఎస్‌ కంపెనీ ఆధ్వర్యంలో ఎస్‌ఎంఎస్‌ చీఫ్‌ విజిలెన్స్‌ అధికారి ఖలీల్‌ సొదాగర్‌ ఆధ్వర్యంలో ఆశ్రమానికి రూ.2 లక్షలు విలువ చేసే మంచాలు, బియ్యం ప్యాకెట్లు, దుప్పట్లు, చీరలు, టీషర్ట్స్‌, ప్యాంట్లతోపాటు వికలాంగులకు కావలసిన సామగ్రి, ఆశ్రమంలో వృద్ధులు కూర్చునేందుకు బల్లలను ఆశ్రమానికి అందించారు. ఈ సందర్భంగా చీఫ్‌ విజిలెన్స్‌ అధికారి ఖలీల్‌ సొదాగర్‌ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎస్‌ఎంఎస్‌ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాలకు, అనాథ ఆశ్రమాలకు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకొని తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్‌ సీఐ నరసింహులు, ఎస్‌ఎంఎస్‌ కంపెనీ జీఎం నిషికాంత్‌ బోరే, హెచ్‌ఆర్‌ నరేష్‌ నాగ పూరే, డిప్యూటీ మేనేజర్‌ పవన్‌కుమార్‌రెడ్డి, సీనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ సురేష్‌ కుమార్‌రెడ్డి, అంకాలమ్మ ఆలయ చైర్మన్‌ ప్రసాద్‌, సీనియర్‌ పాత్రికేయుడు రంగనాయకులు, ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.



అంధులకు తదితర వస్తువులను అందిస్తున్న చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ ఖలీల్‌ సొదాగర్‌

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పెండ్లిమర్రి : కులవృత్తుల వారు, కళాకారులు ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో శుక్రవారం కుల వృత్తులు చేసుకోనేవారు, కళాకారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదరణ పథకం కింద కులవృత్తులు చేసుకోనేవారికి, కళాకారులకు పనిముట్లను అందిస్తుంది. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కులవృత్తుల వారు, కళాకారులు పాల్గొన్నారు.

అటవీ సంపద రక్షణ మనందరి బాధ్యత

కమలాపురం : సహజ వనరులైన అటవీ సంపదను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రిటైర్డ్‌ డిస్ట్రిక్‌ హెల్త్‌ ఎడ్యుకేషన్‌ ఆఫీసర్‌ గుణశేఖర్‌ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో భారత ప్రభుత్వ కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ అనుబంధ నెహ్రూ యువ కేంద్రం సహకారంతో మదర్‌ థెరిసా ఛారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులను రక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముఖ్యంగా అటవీ సంపద దోపిడికి గురి కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ అటవీ సంపదను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉందన్నారు. అడవులను నరుక్కుంటూ పోతే చివరకు వర్షాలు కూడా కురిసే పరిస్థితి ఉండదన్నారు. ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే సామాజిక అడువుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. రక్షిత అడువుల సంరక్షణ, అడవుల పెంపకం యొక్క ఆవశ్యకతను చాటి చెప్పాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అటవీ సంపద–రక్షణ బాధ్యత అంశాలపై వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సత్యనారాయణరెడ్డి, ట్రస్ట్‌ చైర్మన్‌ జూటూరు విజయ్‌, హెచ్‌ఓడీ బి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుణశేఖర్‌

నీటి ఎద్దడి లేకుండా చూడండి

కమలాపురం : వేసవి కాలం ముగిసే వరకు మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె ఓహెచ్‌ఎస్‌ఆర్‌ను ఆమె పరిశీలించారు. రెండు వాల్వులు పనిచేయడం లేదని తెలుసుకున్నారు. తక్షణం వాటిని మార్చాలని కార్యదర్శిని ఆదేశించారు. అలాగే ట్యాంక్‌ సమీపంలో ఎవరు కూడా చెత్త వేయకుండా చూడాలన్నారు. అలా ఎవరైన చెత్త వేస్తే రూ.2000 జరిమానా విధిస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఓఆర్‌ఎస్‌ పాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని ఎఫ్‌ఏ, ఏపీఓలను ఆదేశించారు. కూలీల సంఖ్య పెంచాలని, ప్రతి రోజు రూ.300 కూలీ డబ్బులు పడే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆధార్‌ మొబైల్‌ సెంటర్‌ను పరిశీలించారు. ఆధార్‌ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కెజియా తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

పులివెందుల రూరల్‌ : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రక్తనిధి మెడికలాఫీసర్‌ డాక్టర్‌ భార్గవ్‌ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌ సర్వజన ప్రభుత్వాసుపత్రిలోని రక్తనిధికేంద్రంలో ఇంపాక్ట్‌ ఫౌండర్‌ డాక్టర్‌ గంపా నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా ఇంపాక్ట్‌ విస్డమ్‌ క్లబ్‌ బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తనిధి మెడికలాఫీసర్‌ రక్తదానం చేసిన యువకులను అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఇంపాక్ట్‌ విషెడోమ్‌ క్లబ్‌ ట్రైనర్‌ రమేష్‌, రక్తనిధి, ఎస్‌ఏహెచ్‌ఎస్‌ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో

జమ్మలమడుగు : డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధులైన భగత్‌సింగ్‌, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాతలు ప్రాణాదాతలు అవుతారన్నారు. నేటికి ఎంతో మంది రక్తం లేక మరణించిన పరిస్థితులు సమాజంలో కనిపిస్తున్నాయన్నారు. యువత ఏడాదికి ఒక్కసారైన రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దేవగుడి నారాయణ రెడ్డి, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళ లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్‌ కడప వారి ద్వారా కుట్టు మిషన్‌ శిక్షణ ఇస్తున్నామని, దీనికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ పగడాల జగన్నాథ్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన సభ్యులు ఆధార్‌, రేషన్‌ కార్డుతో పాటు కుల ధృవీకరణ పత్రంతో సహా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. 18–50 సం. గల వారు కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులన్నారు. అర్హులందరూ పట్టణంలోని 4 సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి 2, 3వ ఆర్‌ఎస్‌కేలలో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్లతో పాటు కుట్టు మిషన్లు ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. నగర పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

ఆదర్శ గ్రామంగా పేరు నిలబెట్టుకోవాలి



ప్రజలకు డస్ట్‌బిన్‌లను అందజేస్తున్న ఎంపీడీఓ సయ్యద్‌ ఉన్నీసా

జమ్మలమడుగు రూరల్‌ : ఆదర్శ గ్రామంగా ఉన్న పేరును ఎస్‌.ఉప్పలపాడు గ్రామ ప్రజలు నిలబెట్టుకోవాలని మండల ఎంపీడీఓ సయ్యద్‌ ఉన్నీసా తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎస్‌. ఉప్పలపాడు గ్రామంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు డస్ట్‌బిన్‌లను ఆమె అందజేసి మాట్లాడారు. చెత్తను గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తమ ఇంటి వద్దకు వచ్చే బండ్లలో వేయాలని ఆమె సూచించారు. అనంతరం టీబీహెచ్‌ఎల్‌సీ మాజీ చైర్మన్‌ వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సీఎంఓ విజయానంద్‌, రాంమనోహర్‌రెడ్డి, స్థానిక ప్రజల సహకారంతో గ్రామంలో కాల్వలు, రోడ్లు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. దీంతో అధికారులు గుర్తించి ఆదర్శ గ్రామంగా ఎంపిక చేశారని ఆయన తెలిపారు.

డౌన్‌ సిండ్రోమ్‌ పట్ల అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : డౌన్‌ సిండ్రోమ్‌ (పెదవుల చీలిక) సమస్యపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్‌ ప్రశాంత్‌వర్ధన్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ ప్రసన్నలత తెలిపారు. శుక్రవారం కడప నగరం నాగరాజు పేట అర్బన్‌ హెల్త్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో ప్రపంచ డౌన్‌ సిండ్రోమ్‌(పెదవుల చీలిక) దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు.